సాక్షి మహబూబాబాద్

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



క్లైమాక్స్‌కు రాజలింగమూర్తి హత్య కేసు

- 8లో▸

నాగవెల్లి రాజలింగమూర్తి (49) హత్య కేసు క్లైమాక్స్‌కు చేరింది. ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



కొత్త ఇసుక ప్రాజెక్టులు గుర్తించాలి

టీజీఎండీసీలో కొత్త ఇసుక ప్రాజెక్టులు గుర్తించాలని మైనింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
37^0/19^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు కాస్త ఉక్కపోతగా ఉంటుంది. రాత్రిపూట కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

తొర్రూరు రూరల్: ఆర్టీసీ తొర్రూరు డిపో ఆధ్వర్యంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మేనేజర్ పద్మావతి గురువారం తెలిపారు. ఉదయం 11నుంచి 12గంటల వరకు 99592 26053 నంబర్‌కు ఫోన్‌చేసి సలహాలు, సూచనలు చేయాలన్నారు. బస్ సర్వీసులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలియజేయాన్నారు.

వీరభద్రస్వామికి హీరో గోపిచంద్ పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారిని ప్రముఖ సినీహీరో గోపిచంద్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన పేరుతోపాటు కుటుంబసభ్యుల పేర్లపై గోత్రనామార్చనలు చేశారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఈఓ సత్యనారాయణ మహాశివరాత్రి నుంచి జరగబోయే వీరభద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. కుటుంబసమేతంగా స్వామివారి దర్శనానికి రావాలని కోరారు. ఆయన వెంట సినీనిర్మాత శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త చిన్నం గణేశ్ ఉన్నారు.

వైద్యాధికారుల తనిఖీ



నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని నిఖ్మా హెల్త్ కేర్ సెంటర్ (శ్రీవెంకటేశ్వర నర్సింగ్ హోం)ను వైద్యారోగ్యశాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రమీల ఆస్పత్రిలోని రోగుల రికార్డులు, అందుతున్న సేవలు, ల్యాబ్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కేవీ రాజు, గీత తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఉద్యోగులకు పోస్టింగులు

సాక్షి ఎఫెక్ట్..

నెహ్రూసెంటర్: గ్రూప్–4 ఉద్యోగులకు పోస్టింగులు ఇచ్చారు. ఇటీవల గ్రూప్–4 ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసి పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ మేరకు ఈ నెల 19న 'సాక్షి దినపత్రిక'లో 'కొత్త ఉద్యోగుల హైరానా' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై గురువారం అధికారులు స్పందించారు. ఉద్యోగులకు పోస్టింగులు ఇచ్చారు. దీంతో ఉద్యోగులు 'సాక్షి దినపత్రిక'కు కృతజ్ఞతలు తెలిపారు.

రక్తహీనతపై అవగాహన కల్పించాలి

మహబూబాబాద్: రక్తహీనత వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కాకతీయ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దయాకర్ అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక లయన్స్ క్లబ్‌లో అయోడిన్ డెఫిసెన్సీ–రక్తహీనత అనే అంశంపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దయాకర్ మాట్లాడుతూ.. రక్తహీనత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఐజీడీ కోఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వ ఇంటర్న్‌షిప్ పథకం అమలుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ డైరెక్టర్ మల్సూర్ గురువారం తెలిపారు. పథకం రెండో దశ నోటిఫికేషన్ వచ్చిందని, 21 నుంచి 24 మధ్య వయస్సు గల విద్యార్థులు మార్చి 11లోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదిపాటు నెలకు రూ.5 వేల చొప్పున, ఒక్కసారి సాయం కింద రూ.6 వేలు అందుతాయన్నారు. 12 నెలల వ్యవధిలో కనీసం 6 నెలలు ఉద్యోగ శిక్షణ ఉంటుందన్నారు. దరఖాస్తుదారుల కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగి ఉండకూడదని, పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమా, డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ. 8లక్షలలోపు ఉండాలని, ఇతర వివరాలకు 1800 11 6090 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇసుకపై ఫోకస్..

రవాణాపై పోలీసుల నిఘా
- ఉన్నతాధికారుల ఆదేశాలతో కట్టుదిట్టం
- వాగుల పరీవాహకంలో చెక్ పోస్టులు
- అక్రమ రవాణాదారులపై కేసులు



చిన్నగూడూరు వద్ద ఆకేరు వాగులో పరిశీలిస్తున్న ఎస్పీ(ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో ఇసుక దందాపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి కట్టడి చేస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఇసుక పాలసీ తీసుకొచ్చి ఇందిరమ్మ ఇళ్లతోపాటు, సామాన్యులకు అందుబాటు ధరకు ఇసుక సరఫరా చేయాలనే ఆలోచన చేసింది. ఈమేరకు రాష్ట్ర అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి పెట్టి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తున్నారు. అయితే ఇంతకాలం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగిన ఇసుక దందా ఒక్కసారిగా ఆగిపోవడంతో అక్రమార్కులు సతమతమవుతున్నారు.

చెక్‌పోస్టులు..

నూతన ఇసుక పాలసీ అమల్లోకి వచ్చేవరకు ఏర్లు, వాగుల నుంచి తట్టెడు ఇసుక కూడా బయటకు రావొద్దని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఈనెల 12న ఇసుక అక్రమ రవాణా కట్టడి చేయాలని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. కాగా, ఆ మరుసాటి రోజు నుంచి ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ జిల్లాలోని ఆకేరువాగు, మున్నేరు, పాలేరు వాగు పరీవాహక ప్రాంతాల్లో పర్యటించారు. ప్రధానంగా నెల్లికుదురు, నర్సింహులపేట, చిన్నగూడూరు, డోర్నకల్, మరిపెడ, గూడూరు, గార్ల, బయ్యారం, దంతాలపల్లి, పెద్దవంగర పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. ఐదు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, అక్కడ పోలీసులకు ప్రత్యేక డ్యూటీలు వేశారు. రాత్రింబవళ్లు నిఘా పెంచారు.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ఇసుక అక్రమ రవాణా చేయవద్దని పోలీసులు హెచ్చరించినా.. వినకుండా అదే తంతుగా వ్యవహరిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరించారు. 71మందిని బైండోవర్ చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. అదేవిధంగా గత తొమ్మిది రోజుల్లో ఎనిమిది కేసులు నమోదు చేశారు. ఎనిమిది ట్రాక్టర్లు సీజ్ చేశారు. 11మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

అక్రమార్కుల ఉక్కిరిబిక్కిరి..

దశాబ్దాలుగా కొంతమంది ఇసుక అక్రమ రవాణాతో కోట్లకు పడగలెత్తారు. ఈక్రమంలో పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాముళ్లు తీసుకొని వారికి సహకరించారు. అలాగే పెద్ద నాయకుల నుంచి చోటామోటా నాయకుల వరకు ఇసుక మామూళ్లే ప్రధాన ఆర్థిక వనరుగా మారింది. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు.. జిల్లా ఎస్పీ స్వయంగా రంగంలోకి దిగడంతో ఎవరూ నోరు మెదపని పరిస్థితి నెలకొంది. దీంతో ఇసుక మాఫియాదారులతోపాటు నెలవారీ మామూళ్లు తీసుకునే అధికారులు, పలువురు నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పాలసీ ఎప్పుడు వస్తుందో.. అందులో ఏం ఉంటుందో అనే ఆందోళన కూడా వారిలో మొదలైంది.

అక్రమ రవాణాను సహించేది లేదు



జిల్లాలోని వాగుల నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే సహించేదిలేదు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అన్ని చోట్ల చెక్‌పోస్టులు పెట్టాం. పలు ట్రాక్టర్లను సీజ్ చేశాం. పలువురిపై కేసులు నమోదు చేశారు. అక్రమ వ్యవహారంలో జోక్యం చేసుకుంటే పోలీస్ అధికారులను కూడా సస్పెండ్ చేస్తాం.

\- సుధీర్ రాంనాథ్ కేకన్, ఎస్పీ

మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలని, వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారితో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నివారణకు పోలీస్‌శాఖ కృషి చేస్తుందని, ఇతర శాఖలు సహకారం అందించాలన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టేదిశగా దృష్టి సారించాలన్నారు. కళాజాత బృందాల ప్రదర్శనలు, ర్యాలీలు పలు ఇతర కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేకించి గంజాయి వివిధ మార్గాల ద్వారా రవాణా అవుతుందని, ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. మాదక ద్రవ్యాల రవాణా, ఉత్పత్తి చట్ట వ్యతిరేక చర్య అన్నారు. యువతీ యువకులు మాదక ద్రవ్యాలకు బానిసై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. మెడికల్ విభాగం ఆధ్వర్యంలో డీ– అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మానుకోట, తొర్రూరు ఆర్డీఓలు కృష్ణవేణి, గణేశ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకట్, డీఎంహెచ్ఓ మురళీధర్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరిటెండెంట్ శ్రీనివాసరావు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

జిల్లాలో వేసవికాలంలో నీటిఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో నీటి ఎద్దడిపై మిషన్ భగీరథ, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి పైప్‌లైన్ మరమ్మతులు, ఇతర పనులు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, డీపీఓ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ చేయాలి..

జిల్లాలోని వసతిగృహాలను జిల్లా, ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో హాస్టళ్ల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. హాస్టళ్లలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

గూడ్స్ ట్రైన్ మేనేజర్లకు పదోన్నతులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ కేంద్రంగా విధులు నిర్వహిస్తున్న 40మంది గూడ్స్ ట్రైన్ మేనేజర్లు (గార్డులు) సీనియర్ గూడ్స్ ట్రైన్ మేనేజర్లుగా పదోన్నతులు పొందినట్లు గురువారం రైల్వే అధికారులు తెలిపారు. పదోన్నతులు పొందిన వారిలో కొందరిని బెల్లంపల్లి, రామగుండం, డోర్నకల్‌కు రైల్వేస్టేషన్లకు బదిలీపై పంపిస్తూ సికింద్రాబాద్ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన పలువురికి కాజీపేట రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ రవీందర్ రిలీవ్ లెటర్స్ అందజేశారు.

అధికారుల సూచనలు పాటించాలి



సబ్‌సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ

గూడూరు: రైతులు పంటల సాగులో తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తీగలవేణిలో బుధవారం డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేను పరిశీలించారు. అనంతరం మండలంలోని గాజులగట్టు, తీగలవేణి, గూడూరు, బొద్దుగొండ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలలో యూరియా నిల్వను పరిశీలించారు. ఏఓ అబ్దుల్ మాలిక్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల గోదాం తనిఖీ

కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామంలోని ధన్నసరి పీఏసీఎస్ సబ్‌సెంటర్‌కు చెందిన ఎరువుల గోదాంను మహబూబాబాద్ ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు పీఓఎస్ మిషన్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ ఆధార్‌కార్డు, ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులను కొనుగోలు చేయాలన్నారు. రైతులు పంటకు కావాల్సిన మోతాదులోనే యూరియాను ఉపయోగించాలని, లేకుంటే వరి, మొక్కజొన్న పంటల్లో తెగుళ్ల ఉధృతి పెరిగే ప్రమాదం ఉందన్నారు. అనంతరం గ్రామ శివారు యాసంగిలో ఏఈఓలు చేస్తున్న డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ వెంకన్న, డివిజన్ సాంకేతిక వ్యవసాయ అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరోత్తంరెడ్డిని గెలిపించాలి



ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు

మహబూబాబాద్ అర్బన్: నల్లగొండ–వరంగల్–ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. బీజేపీ నాయకులు జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ బలపరిచిన పులి సరోత్తంరెడ్డిని గెలిపిస్తే పీఆర్‌సీ కోసం పోరాడుతామని, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నలంద డిగ్రీ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఒద్దిరాజు రామచంద్రరావు, యాప సీతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, నాయకులు మహేశ్, పద్మ, పాపారావు, సంపత్, ప్రేమ్‌కుమార్, నరేశ్ నాయక్, సుధాకర్, శ్రీకాంత్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మంచంలోనే సజీవదహనం..

- భార్య చనిపోయిందనే మనస్తాపంతో పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్య
- 'గటక' ఎవరికి పోయాలి కొడుకా అంటూ గుండెలవిసేలా రోదించిన తల్లి
- కురవి మండల కేంద్రంలో విషాదం



యాదగిరి(ఫైల్)



రోదిస్తున్న తల్లి నాగమ్మ

కురవి: భార్య చనిపోయిందనే కారణంతో కొంతకాలంగా మనస్తాపం చెందుతున్న ఓ వ్యక్తి.. పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని మంచంలోనే సజీవదహనమయ్యాడు. ఈ ఘటన కురవిలో జరిగింది. ఎస్సై గండ్రాతి సతీశ్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని 747కాలనీకి చెందిన తరాల యాదగిరి(46) భార్య విజయ కొన్నేళ్ల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో మంచంలో పడుకున్నాడు. తల్లి నాగమ్మ కొడుకు అన్నం తినకపోవడంతో జొన్న గటక తాగించేందుకు ప్రయత్నించగా వద్దని అలాగే పడుకుని ఉన్నాడు. దీంతో తల్లి పనినిమిత్తం బయటకు వెళ్లింది. అనంతరం ఎవరూ లేని సమయంలో యాదగిరి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంచంలోనే సజీవదహనమయ్యాడు. ఇంటి నుంచి పొగలు వస్తుండగా కాలనీ వాసులు చూసి తలుపును తీసి చూడడంతో మంచంలోనే సజీవదహనమై కనిపించాడు. దీంతో వారు కుటుంబ సభ్యులకు విషయం తెలపడంతో వివిధ పనులకు వెళ్లిన మృతుడి తల్లి, చెల్లె, అన్న, తమ్ముడు వచ్చి యాదగిరి మృతదేహన్ని చూసి బోరున విలపించారు. కొడుకు అఖిల్‌కు సమాచారం అందించడంతో తండ్రి మృతదేహన్ని చూసి కన్నీరుమున్నీరుగా రోదించాడు. ఈ ఘటనపై కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై సతీశ్ వివరించారు. కాగా, మృతుడికి కొడుకు అఖిల్, కుమార్తె దివ్య ఉన్నారు.

గటక ఎవరికి పెట్టాలి బిడ్డా..

చనిపోవడానికి ముందు పడుకుని ఉన్న కొడుకు ఆకలితో ఉన్నాడని భావించిన తల్లి నాగమ్మ జొన్న గటక తీసుకుని వచ్చి తాగమని బతిమిలాడింది. అయితే యాదగిరి తనకు ఆకలి కావడం లేదని వద్దనడంతో తల్లి పనినిమిత్తం బయటకు వెళ్లగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు చనిపోయిన విషయం తెలియగానే గటక కలిపిన గిన్నెతో అక్కడికి వచ్చి ఈ గటక ఎవరికి పెట్టాలి కొడుకా అంటూ తల్లి గుండెలవిసేలా రోదించింది. కొడుకు మృతదేహం మీద పడి బోరున విలపించింది.

దాతల సాయం

- ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనానికి దాతృత్వం
- జిల్లాలోని మూడు కళాశాలల్లో అమలు



తొర్రూరులో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న అధ్యాపకులు(ఫైల్)

తొర్రూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన ఫలితాల కోసం కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఖాళీ కడుపుతో విద్యార్థులు ఇబ్బంది పడవద్దని మధ్యాహ్న భోజనం కోసం దాతలను సంప్రదించారు. వారు పెద్ద మనసుతో విద్యార్థుల కడుపు నింపేందుకు అంగీకరించారు. జిల్లాలోని తొర్రూరు, కేసముద్రం, మహబూబాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ వార్షిక పరీక్షల వరకు దాతలు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ముందుకు వచ్చారు. ప్రస్తుతం మూడు కళాశాలల్లో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

ఖాళీ కడుపుతో కళాశాలలకు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటారు. దూర ప్రాంతాల నుంచి కళాశాలలకు వచ్చే వారికి ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకోవడం ఇబ్బందిగా మారింది. ఉదయాన్నే తరగతులకు హాజరయ్యే హడావుడిలో ఏమీ తినకుండానే కళాశాలకు హాజరవుతున్నారు. ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేని విద్యార్థులు ఆటోల ద్వారా కళాశాలకు వస్తున్నారు. కొందరు టిఫిన్ బాక్సుల్లో తెచ్చుకుంటున్న భోజనాలు తింటుండగా, మరికొందరు తాగునీటితోనే కడుపు నింపుకుంటున్నారు. జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వీరి పరిస్థితిని గమనించిన ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు దాతలను సంప్రదించడంతో మధ్యాహ్న భోజనం అందించేందుకు ముందుకు వచ్చారు. తొర్రూరులో మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిరికొండ విక్రమ్‌కుమార్‌ను సంప్రదించగా పలువురు దాతలతో మాట్లాడి మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. కేసముద్రం, మహబూబాబాద్ కళాశాలల్లోనూ దాతలు చేయూత అందిస్తున్నారు.

చదువుపై మరింత శ్రద్ధ



ఇంట్లో ఉదయాన్నే ఏమీ తినకుండా కళాశాలకు వస్తున్నాను. మధ్యాహ్నం కళాశాలలోనే భోజన సౌకర్యం ఉండడంతో ఎంతో వెసులుబాటుగా ఉంది. సాయంత్రం 4 గంటల వరకు శ్రద్ధగా పాఠాలు వింటున్నాను. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి మధ్యాహ్న భోజనం దోహదపడుతుంది.

\- మాలోతు లావణ్య, విద్యార్థిని, తొర్రూరు

ఆనందంగా ఉంది



తొర్రూరు మండలంలోని సోమారపుకుంట తండా నుంచి కళాశాలకు వస్తున్నాను. మా తండా నుంచి మూడు కిలోమీటర్లు మడిపల్లి వరకు నడిచి అక్కడి నుంచి బస్సు ఎక్కి తొర్రూరుకు వస్తున్నా. తరగతులకు ఉదయాన్నే హాజరయ్యే క్రమంలో ఏమీ తినకుండా వస్తున్నాను. దాతలు మధ్యాహ్న భోజనం అందించడం ఆనందంగా ఉంది.

\-జె. ప్రమీల, విద్యార్థిని

విద్యార్థుల హాజరుశాతం పెరిగింది



జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా మూడింటిలో దాతల చేయూతతో మధ్యాహ్న భోజన కార్యక్రమం కొనసాగుతోంది. ఆ కళాశాలల్లో హాజరు శాతం పెరిగింది. మధ్యాహ్న భోజనం అందించిన కళాశాలల్లో ఏటా ఉత్తీర్ణత శాతం పెరుగుతోంది.

\-సీహెచ్.మదార్‌గౌడ్, డీఐఈఓ, మహబూబాబాద్

తెగుళ్ల నివారణపై అవగాహన

కేసముద్రం: మండలంలోని అమీనాపురం రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వరంగల్‌కు చెందిన విద్యార్థినులు పంటలకు సోకే తెగుళ్ల, నివారణపై గురువారం అవగాహన కల్పించారు. వరి, మొక్కజొన్న పంటలకు సోకే అగ్గితెగులు, కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగు వంటి తెగుళ్ల లక్షణాలను వివరించి నివారణ చర్యలను తెలిపారు. రైతులు అరిద్రపు శ్రీనివాస్, షేకిడి సారంగపాణి, గడిపెల్లి రవి, అరిద్రపు కుమార్, సతీష్, రవి, కస్తూరి వెంకన్న పాల్గొన్నారు.

ఒకరికి ఏడాది జైలుశిక్ష

డోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌పై దాడి చేసి అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి మహబూబాబాద్ కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించింది. డోర్నకల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెన్నారం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌పై 2019 ఫిబ్రవరి 11న అదే గ్రామానికి చెందిన అనపర్తి వెంకన్న డబ్బుల బాకీ విషయంలో గొడవపడి అసభ్యంగా ప్రవర్తించి దాడి చేయగా.. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ శ్యాంసుందర్ కేసు నమోదు చేయగా ఏఎస్సై సూరయ్య ఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. ఎనిమిది మంది సాక్షులను ప్రస్తుత సీఐ బి.రాజేశ్, కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్ కోర్టులో హాజరుపర్చారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జయలత వాదనలు వినిపించగా అడిషనల్ జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ టి.తిరుపతి వెంకన్నకు ఏడాది జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మార్కెట్‌లో వాకీటాకీలతో సమాచారం

- కేసముద్రం మార్కెట్‌లో అమలు





వాకీటాకీలో సిబ్బందితో మాట్లాడుతున్న స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు

కేసముద్రం: ప్రజాభద్రత కోసం పోలీసులు వాకీటాకీలను ఉపయోగించడం సహజంగా చూస్తుంటాం. కానీ రాష్ట్రంలో ఏ మార్కెట్‌లో లేని విధంగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో కొత్తగా వాకీటాకీలను అమల్లోకి తీసుకువచ్చారు. ఇటీవల మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ప్రత్యేక చొరవతో అధికారులు, సిబ్బందికి 10 వాకీటాకీలను అందజేశారు. మార్కెట్ యార్డుల్లో సరుకులను ఖరీదు చేసే సమయంలో, కాంటాలు, తొలకాలు జరిగేటప్పుడు, ఏమైనా సమస్యలు తలెత్తినా వెంటనే సిబ్బంది అప్రమత్తమై తమ వద్దనున్న వాకీటాకీల ద్వారా అధికారులకు సమాచారం అందిస్తున్నారు. మార్కెట్ యార్డుల్లో పరిస్థితిపై ఎప్పటికప్పుడు మార్కెట్ అధికారులు వాకీటాకీల ద్వారా తెలుసుకుంటూ సిబ్బందికి తగు సూచనలు చేస్తున్నారు. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం, సమస్యలు తెలుసుకొని, వెంటనే పరిష్కరిస్తున్నామని స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు తెలిపారు.

విరగబూసిన మామిడి

మానుకోట పట్టణం సిగ్నల్ కాలనీలోని ఒకరి ఇంటి అవరణలో మామిడి చెట్టు విరగబూసింది. దీంతో చెట్టు బంగారు వర్ణంలో చూపరులను ఆకర్షిస్తోంది.

\- మహబూబాబాద్ రూరల్



పూతతో కనిపిస్తున్న మామిడి చెట్టు

యూత్ ఫెస్టివల్‌తో నాయకత్వ లక్షణాలు

● ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్



మాట్లాడుతున్న వీసీ దీపక్‌గార్గ్

హసన్‌పర్తి: యూత్ ఫెస్టివల్‌తో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ అన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం యూత్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ దీపక్ గార్గ్ మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికి తీయడానికి ఈ వేదిక ఉపయోగపడుతోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాల్లో తమ ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డాక్టర్ వి.మహేశ్, డాక్టర్ వి.వి.వి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ డాక్టర్ కె. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలతోనే గుర్తింపు



ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న రామనాథం

ఖమ్మంవైద్యవిభాగం: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతోనే ఆస్పత్రులకు గుర్తింపు లభిస్తుందని పలువురు వైద్యులు పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నెహ్రూనగర్‌లోని 'అఖిల' కంటి ఆస్పత్రి ఏడో వార్షికోత్సవం నిర్వహించగా డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఓపీ చాంబర్‌ను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ అఖిల మాట్లాడుతూ నెలలు నిండకుండా జన్మించిన చిన్నారుల్లో రెటీనా సంబంధిత సమస్యలు ఎదురైతే వైద్యం అందించడం సంతృప్తిగా ఉందని తెలిపారు. ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ మాధవి, మేనేజింగ్ డైరెక్టర్ కుతుంబాక మధు, డాక్టర్ సమత, శ్రీధర్, సతీశ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పునర్నియామకం



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం విజయభాను

హన్మకొండ: వివిధ కారణాలతో తొలగించిన ఆర్టీసీ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. గురువారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నలుగురు డ్రైవర్లు, నలుగురు కండక్టర్లను పునర్నియామకం చేస్తూ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం విజయభాను మాట్లాడుతూ ఉద్యోగులు అంకితభావం, నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వర్తించాలన్నారు. కుటుంబ సభ్యులు విధులకు వచ్చే వారిని మానసిక ప్రశాంతతో పంపించాలన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. గతంలో జరిగిన తప్పులు, పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలన్నారు. డిప్యూటీ ఆర్ఎంలు కేశరాజు భానుకిరణ్, మాధవరావు, పర్సనల్ ఆఫీసర్ అర్పిత పాల్గొన్నారు.

మాతృభాషకు ఓరుగల్లు మణిహారం..

తెలుగు భాషను గుబాళింపజేసిన ఉమ్మడి జిల్లా సాహితీవేత్తలు

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



పుట్టిన ప్రతీ ఒక్కరిది మొదట మాతృభాషనే. వారి తల్లిదండ్రులు, చుట్టూ సమాజం పెంచి పెద్ద చేస్తుంది. తల్లిమీద గౌరవం ఎంత ఉంటుందో మాతృభాషపై కూడా అంతే గౌరవం ఉండాలి. అందుకే ఏ దేశస్తుడికైనా మాతృభాషపై మమకారం ఉండాలన్నది పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు సిద్ధాంతం. పూర్తిగా తెలుగు రానివారి గురించి బాధలేదు. కానీ తెలుగు రాయడం.. చదవడం వచ్చిన వారు కూడా భాష రాదని ఫోజు కొట్టడం చూసి కాళోజీ తీవ్రంగా మందలించేవారు. కాగా, శుక్రవారం(21వ తేదీ) అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

– హన్మకొండ కల్చరల్

ఏ భాషరా నీది? యేమి వేషమురా?

1942లో నిజాం రాష్ట్రంలో ప్రజలు తమ మాతృభాష తెలుగుపై నిరాదరణతో ఉండడం చూసి పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు స్పందించారు. ఏ భాషరా నీది? యేమి వేషమురా? /ఈ భాష ఈవేష మెవరి కోసమురా?/ ఆంగ్లమందున మాటలాడ గలుగగనే/ ఇంతగా గుల్కెదవు ఎందుకోసమురా?/ అన్యభాషలు నేర్చి ఆంధ్రంబురాదంచు/ సకిలించు ఆంధ్రుడా ! చావవెందుకురా? అంటూ అలాంటి వారిని అపహస్యం చేశారు.

తెలుగు భాషను గుబాళింపజేసిన ఓరుగల్లు సాహితీవేత్తలు..

కాకతీయులు ఓరుగల్లును రాజధానిగా చేసుకుని యావత్ ఆంధ్రాదేశాన్ని పాలించారు. దీంతో పాటు ఓరుగల్లు నాటి నుంచే సారస్వత రంగంలోనూ ప్రముఖపాత్ర వహించింది. కాకతి గణపతిదేవచక్రవర్తి ఆ స్థానాన్ని సందర్శించిన తర్వాతే తిక్కన సోమయాజీ మహాభారత రచన చేపట్టినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. 13వ శతాబ్దంలో పాలకుర్తిలో జన్మించిన సోమనాథుడు బసవపురాణాన్ని, 14వ శతాబ్దంలో పోతానామాత్యులు మహాభాగవతాన్ని రచించారు. ఎందరో కవులు పురాణాలను తెలుగులోకి అనువదించిన వారున్నారు. ఆధునిక కాలంలో రచనలు చేసిన వారిలో మాడపాటి హన్మంతరావు మొదటివారు. హన్మంతరావు 1911లో రాసిన నవనాగరికత మొదటికథగా చెప్పుకోవచ్చు. ఆ తరువాత 1927లో వద్దిరాజు రాఘవ రంగారావు, వద్దిరాజు సీతారామచంద్రరావులు, పెంద్యాల రాఘవరావు, కాళోజీ నారాయణరావు, పి.వి. నరసింహారావు, పొట్లపల్లి రామారావు, దాశరథి రంగాచార్యులు, టి. హైయగ్రీవాచారి, బండారు చంద్రమౌళీశ్వరరావు, అద్లూరి అయోధ్య రామయ్య, బిరుదురాజు రామరాజు, పెంద్యాల శేషగిరిరావు, దేవులపల్లి రామానుజరావు, వాసుదేవరావు, తదితరులు కథలు రాశారు. ధూపాటివెంకటరమణాచార్యులు పి.వి. నరసింహారావు, కాళోజీ నారాయణరావు, బండారు సదాశివరావు, అంపశయ్య నవీన్ నుంచి ఇప్పటి వరకు రాస్తున్న కొత్త తరం కవిత్వం కథ నవల విమర్శనా రంగాల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. తెలుగుభాషను గుబాళింపజేస్తున్నారు. విజయవాడ తర్వాత తెలుగునాటకాన్ని రక్తికట్టించింది కూడా ఈ నేల పైనే. తెలుగులోనే పరిపాలన వ్యవహారాలు జరగాలని, ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులోనే వెలువరించాలని, డిగ్రీలో కూడా తెలుగు ఒక పాఠ్యాంశంగా ఉండాలని, తెలుగు భాషను అభివృద్ధి చేయాలని కోరుతూ తెలుగుభాషోద్యమ సమాఖ్య ద్వారా కృషి చేశారు. ఓటరు వద్దకు వెళ్లి తెలుగులో ఓటు అడగడం తప్పు కానప్పుడు తెలుగులో పాలన వ్యవహారాలు ఎందుకు నిర్వహించరని ప్రశ్నించారు. ఆచార్య పేర్వారం జగన్నాథం, వడుగు గోపాల్‌రావు, ఆచార్య హైమావతి తదితరులు తెలుగుభాష అభివృద్ధి కృషిచేశారు. 2012 తరువాత తెలుగుభాషోద్యమం కనుమరుగైంది.

తెలుగుభాషోద్యమ కేంద్రం ...

హనుమకొండలోని శ్రీరాజరాజనరేంద్రాంధ్రభాషా నిలయానికి ఘనచరిత్ర ఉంది. నిజాం వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించింది. నిజాంల కాలంలో మొదట అధికార భాషగా పర్షియన్ ఉండేది. తర్వాత ఉర్దూ అధికార భాషగా స్థానం పొందింది. పాఠశాలలో ఉర్దూ మీడియంలోనే చెప్పేవారు. 90 శాతం ప్రజల మాతృ భాషగా ఉన్న తెలుగులో చదువుకునే అవకాశం లేదు. అలాంటి పరిస్థితులలో నిజాం రాష్ట్రంలో పలుచోట్ల పౌరగ్రంథాలయాల స్థాపన ఉద్యమంగా జరిగింది. వీటిలో మొదటిది సెప్టెంబర్, 1, 1901లో స్థాపించబడిన శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయం కాగా, రెండోది 1904 ఫిబ్రవరి 2 తేదీన శ్రీరాజరాజనరేంద్రాంధ్రభాషా నిలయం కావడం విశేషం. ధూపాటి వెంకటరమణచార్యులు సేకరించిన ఎన్నో అమూల్య తాళపత్రగ్రంథాలు, శాసనాల అచ్చులు, పురాతన నాణెలు ఈ గ్రంథాలయంలోనే భద్రపరిచారు. పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, మహాకవి శ్రీశ్రీ, కవిసామ్రాట్ విశ్వనాథసత్య నారాయణ, గుర్రం జాషువా వంటి ఎందరో విభిన్న సాహితీవేత్తలు ఇక్కడే ఉపన్యాసాలు ఇచ్చారు. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు, జాతీయాచార్యులు బిరుదురాజు రామరాజు వంటి ఎందరో ప్రముఖులు ఇక్కడే చదువుకున్నారు. తెలంగాణలో తెలుగుభాషా ఉద్యమానికి కృషి చేసిన ప్రముఖ కేంద్రాల్లో భాషానిలయం కూడా ఒకటి కావడం మనకు గర్వకారణం.

భాషను రా ఓ మనిషి..



భాషను రా ఓ మనిషి భాషనురా/ ని ఉనికిని చాటే నీ ఆత్మఘోషను రా.../నీ ఉనికిని చాటే ఉత్తమమార్గాన్నిరా/ అలంకరణగా ఉండే అద్భుతాన్ని నేనురా/ సమాజంలో మంచి కోరె సాహిత్యం నేనురా... / నీ భాషను మక్కువతో ఆదరించరా/ మాతృభాషలోనే మన్నను పొందాలిరా...

జూలూరు నాగరాజు, తెలుగు భాషోపాధ్యాయుడు

భాషను విస్మరిస్తే తీవ్ర నష్టం..



మాతృభాష మాట్లాడే యువత సంఖ్య తగ్గిపోతోంది. దీనిని చూసి తల్లిదండ్రులు కూడా సంతోషిస్తున్నారు. కానీ ఒక జాతి సంస్కృతి ధ్వంసమవుతున్నదని వారికి తెలియడం లేదు. ఒక భాష అంతరిస్తే వారి సాహిత్యంతో పాటు, ఆ భాష మాట్లాడే జాతి కూడా అంతరించిపోతుంది.

ప్రొఫెసర్ భూక్య బాబురావు, పీఠాధిపతి, జానపద గిరిజన విజ్ఞానపీఠం

ఇతర భాషల్లో ప్రావీణ్యం ఉండదు..



అమ్మ ఒడిలో ఉగ్గుపాలతో నేర్చుకున్న మాతృభాషలో విద్యను బోధించడం వల్ల విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. మాతృభాష రానివారికి ఇతర భాషల్లోనూ ప్రావీణ్యం ఉండదు. ప్రతిఒక్కరూ మాతృభాషలో పండితుడు కావాల్సిన అవసరం లేదు. కనీసం అర్థం చేసుకోగలిగితే, మాట్లాడగలిగితే చాలు.

–రామారత్నమాల, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగువిభాగం, పింగిళి కళాశాల

ఉమ్మడి గురుకులాల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

● హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ దాసరి ఉమామహేశ్వరి



ఉమామహేశ్వరి

మడికొండ: తెలంగాణ రాష్ట్ర గురుకులాల ఉమ్మడి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్, మడికొండ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. హాల్ టికెట్లు సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హనుమకొండ జిల్లా పరిధిలో మొత్తం 16 సెంటర్లు కేటాయించినట్లు తెలిపారు. 16 సెంటర్లలో 5వ తరగతిలో 2,548, 6లో 895, 7లో 451, 8లో 329, 9వ తరగతిలో 286 మంది విద్యార్థులు పరీక్ష రాయబోతున్నట్లు చెప్పారు. మొత్తం 4,509 మంది హనుమకొండ జిల్లాలో పరీక్ష రాయనున్నారు. పరీక్ష కేంద్రాన్ని ఒక రోజు ముందు చూసుకోవాలని సూచించారు. పరీక్ష రోజు కేంద్రం వద్దకు ఉదయం 9.30 గంటలకు చేరుకోవాలన్నారు. పరీక్ష ప్యాడ్, బ్లూ, బ్లాక్ పెన్, ఆధార్ కార్డు, హాల్ టికెట్ తప్పకుండా తీసుకుని రావాలన్నారు.

నేటినుంచి ఎల్ఎల్‌బీ సెమిస్టర్ల పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బీ మూడేళ్ల మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆసిం ఇక్బాల్ గురువారం తెలిపారు. ఈనెల 21, 24, 28, మార్చి 3, 5వ తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఎల్ఎల్‌బీ మూడేళ్ల లా కోర్సు ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 22 నుంచి నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈనెల 22, 25, మార్చి 1,4, 6 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ఐదేళ్ల లా కోర్సు 5వ సెమిస్టర్ పరీక్షలు

ఐదేళ్ల లా కోర్సు ఐదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21 నుంచి నిర్వహించనున్నారు. ఈనెల 21, 24, 28, మార్చి3, 5తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

ఐదేళ్ల లా కోర్సు తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలు

ఐదేళ్ల లా కోర్సు తొమ్మిదో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 22 నుంచి నిర్వహించనున్నారు. ఈనెల 22, 25, మార్చి 1, 4, 6వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

దూరవిద్య పీజీ పరీక్షలు ప్రారంభం

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య పీజీ కోర్సుల ఎంఏ, ఎంకామ్ తదితర పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్ వి. రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ బి. సురేశ్‌లాల్ సందర్శించి పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. వీరి వెంట ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లారమేశ్ ఉన్నారు.

కుటుంబ కలహాలతో భార్యపై భర్త దాడి

● అడ్డొచ్చిన అత్తామామలపై సైతం..
● బాధితులకు ఎంజీఎంలో చికిత్స
● వాసవీ కాలనీలో దారుణం



దాడికి పాల్పడిన చంద్రశేఖర్

ఎంజీఎం : కుటుంబ కలహాలతో భార్యపై భర్త కత్తితో దాడికి పాల్పడ్డాడు. అడ్డొచ్చిన అత్తామామలపై కూడా దాడి చేశాడు. ఈ ఘటన వరంగల్ పోచమ్మమైదాన్ సమీపంలోని వాసవీ కాలనీలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వాసవీ కాలనీ చెందిన జన్నుబాబు–అనిత దంపతుల కుమార్తె పల్లవి ఉర్సు ప్రాంతానికి చెందిన కోట చంద్రశేఖర్‌ను రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. కొన్ని రోజులు పాటు సాఫీగా సాగిన క్రమంలో గతేడాది నుంచి దంపతుల మధ్య వివాదాలు తలెత్తాయి. వీరికి కుమారుడు జన్మించాడు. చంద్రశేఖర్‌తో వివాదం కారణంగా పల్లవి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. రెండ్రోజుల క్రితం చంద్రశేఖర్ కొడుకును తీసుకెళ్లడానికి అత్తగారి ఇంటి రాగా భార్య, అత్తామామ నిరాకరించారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం పల్లవి కొడుకుకు పాలు ఇస్తుండగా చంద్రశేఖర్ కత్తితో వచ్చి నేరుగా భార్య తలపై నరికాడు. ఈ ఘటనలో ఆమె అక్కడే రక్తపు మడుగులో పడిపోయింది. ఈ సమయంలో అత్తామామలు అడ్డుపడగా వారిపై కూడా దాడి చేసి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలపాలైన ముగ్గురిని స్థానికులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కాగా, పల్లవి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అత్త అనిత, మామ బాబు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.

కొత్త ఇసుక ప్రాజెక్టులు గుర్తించాలి

● మైనింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్



అన్నారంలో కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్

కాళేశ్వరం: టీజీఎండీసీలో కొత్త ఇసుక ప్రాజెక్టులు గుర్తించాలని మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, అన్నారం, పలుగుల, పూసుకుపల్లి, మద్దులపల్లిలో ఇసుక రీచ్‌లను కలెక్టర్ రాహుల్‌శర్మ, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. ప్రతీ రోజు ఒక్కో క్వారీలో ఎన్ని టన్నుల ఇసుక తీస్తున్నారు?, రవాణా ఎలా చేస్తున్నారు?, తదితర విషయాలను టీజీఎండీసీ, మైనింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24/7 ఇసుక కోసం ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. స్టాక్ పాయింట్, రీచ్‌లకు వచ్చే మార్గాల్లో సీసీ కెమెరాలు చేసి పటిష్ఠ పర్యవేక్షణకు ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న క్వారీల్లో రోజుకు 8–10 వేలమెట్రిక్ టన్నులకు పెంచాలని, రోజుకు 40–50వేల మెట్రిక్ టన్నుల ఇసుక లోడింగ్ చేసే కొత్త ప్రాజెక్టులను గుర్తించాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని ఇసుక కొరత రాకుండా స్టాక్ పెంచాలని ఆదేశించారు. కాంట్రాక్టర్‌కు క్రమం తప్పకుండా కమీషన్ చెల్లింపులు చేస్తామన్నారు. ఇసుక తీయడానికి అదనపు యంత్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీజీఎండీసీ ఎండీ సుశీల్ కుమార్, పీఓ రంగారెడ్డి, మైనింగ్ ఏడీ జయరాజు, తహసీల్దార్ ప్రహ్లాద రాథోడ్, డీటీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాజలింగమూర్తి కేసును సీబీఐకి అప్పగించాలి

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కె.ఎ.పాల్



మాట్లాడుతున్న కె.ఎ.పాల్

హన్మకొండ: భూపాలపల్లిలో హత్యకు గురైన రాజలింగమూర్తి కుటుంబానికి న్యాయం జరగాలంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కె.ఎ.పాల్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజలింగమూర్తిని హత్య చేసిన దుండగులను ఎందుకు అరెస్ట్ చేయలేదో చెప్పాలన్నారు. పోలీసులు, అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు భయపడొద్దన్నారు. రాష్ట్రంలో 13 నెలల్లో లెక్కలేనన్ని హత్యలు, లైంగిక దాడులు జరుగుతుంటే సీఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదని, రాష్ట్రంలో హోం మంత్రిని ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. రాజలింగమూర్తి కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్.కృష్ణయ్య రాజకీయ పార్టీలకు బానిసయ్యాడని, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో బానిసలుగా ఉన్న బీసీలు బయటకు రావాలని పిలుపునిచ్చారు.. తనను సీఎం చేయాలన్నారు.

క్లైమాక్స్‌కు రాజలింగమూర్తి హత్య కేసు

రాజకీయ పార్టీల అంశంగా భూపాలపల్లి ఘటన

● పక్కా వ్యూహంతోనే మర్డర్.. భార్య సరళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు
● భూపాలపల్లి పోలీసుల అదుపులో ఇద్దరు..? మరో ముగ్గురి కోసం గాలింపు
● నేడు మీడియా ముందుకు నిందితులు..? హత్యకు కారణాలపై క్లారిటీ
● దోషులు ఎంతటి వారైనా వదలం.. అన్ని కోణాల్లో దర్యాప్తు : డీఎస్పీ సంపత్ రావు

సాక్షిప్రతినిధి, వరంగల్/భూపాలపల్లి/భూపాలపల్లి అర్బన్: మాజీ కౌన్సిలర్ భర్త, సామాజిక కార్యకర్త నాగవెళ్లి రాజలింగమూర్తి (49) హత్య కేసు క్లైమాక్స్‌కు చేరింది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం రాజలింగమూర్తి దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. మృతుడి భార్య సరళ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసిన భూపాలపల్లి పోలీసులు మూడు ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి విచారణ వేగవంతం చేశారు. ఈ క్రమంలో ఇద్దరు నిందితులను గురువారం ఉదయమే అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ప్రాథమిక విచారణలో హత్యకు గల కారణాలపై స్పష్టతకు వచ్చినట్లు తెలిసింది. మరో ముగ్గురిని కూడా త్వరలోనే పట్టుకోగలమన్న ధీమాను పోలీసులు వ్యక్తం చేయగా.. శుక్రవారం నిందితులను మీడియా ముందు హాజరుపర్చి వాస్తవాలు వెల్లడించే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

నాగవెళ్లి సరళ ఫిర్యాదులో ఏముంది..?

భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట రాజలింగమూర్తి కుటుంబానికి భూమి ఉందని, ఆ భూమికి సంబంధించి రేణుకుంట్ల కొమురయ్య, రేణుకుంట్ల సంజీవ్ కుటుంబ సభ్యులతో తన భర్తకు గొడవ జరుగుతోందని, బెదిరింపులతో తమ భూమిని కాజేసే ప్రయత్నం చేయగా సివిల్ కోర్టును ఆశ్రయించారని రాజలింగమూర్తి భార్య సరళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. చాలా రోజులుగా ఈ కేసు నడుస్తున్నా.. త్వరలోనే తీర్పు రానుందని గమనించిన వారు తమ భూమిని ఎలాగైనా కాజేయాలనే ఉద్దేశంతో తన భర్త రాజలింగమూర్తిని చంపాలని పథకం వేశారని ఆరోపించింది. ఈ మేరకు రేణుకుంట్ల సంజీవ్, పింగిలి శమంత్ అలియాస్ బబ్లూ, మోరె కుమార్, కొత్తూరి కుమార్ అనే నలుగురు వ్యక్తులు బుధవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో పట్టణంలోని టీబీజీకేఎస్ ఆఫీసు దగ్గరలో రాజలింగమూర్తి వెళ్తుండగా, రెండు వాహనాల మీద వచ్చి ఇనుపరాడ్లతో తలమీద కొట్టి, కడుపు భాగంలో కత్తితో పొడిచి కిరాతకంగా తన భర్త రాజలింగమూర్తిని చంపారని సరళ ఆ ఫిర్యాదులో పేర్కొంది. తన భర్తకు హత్యకు గురయ్యారని తమకు తెలిసినవాళ్లు ఇచ్చిన సమాచారంతో భూపాలపల్లిలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పకి వెళ్లేసరికి అప్పటికే తన భర్త చనిపోయి ఉన్నాడని పేర్కొన్నారు. తన భర్తను హత్యచేసిన వారిపై, ఈ హత్యకు వెనుక ఉండి వ్యూహరచన చేసి ప్రోత్సహించిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సరళ ఫిర్యాదులో పోలీసులను కోరారు.



పోస్టుమార్టం గది వద్ద రోదిస్తున్న మృతుడి భార్య సరళ, బంధువులు

గన్ లైసెన్స్ కోసం దరఖాస్తు..

జిల్లా కేంద్రంలో అటవీ, ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై మృతుడు రాజలింగమూర్తి కోర్టుల్లో ప్రైవేట్ కేసులు వేసేవాడు. ఆ భూములను ఆయా శాఖలకు అప్పగించే వరకు పోరాడేది. గతంలో భూపాలపల్లిలో ఓపెన్‌కాస్ట్ ఏర్పాటుపై గ్రీన్ ట్రిబ్యునల్‌ను సైతం ఆశ్రయించాడు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, రాష్ట్రస్థాయి అధికారులు, కాంట్రాక్టర్‌పై జిల్లా కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. సామాజిక కార్యకర్తగా పని చేస్తున్న తనకు కొందరి నుంచి ముప్పు ఉందని, గన్ లైసెన్స్ కావాలని ఆరు నెలల క్రితం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు సమాచారం. కలెక్టర్ ఆ లేఖను జిల్లా ఎస్పీకి పంపగా, పోలీసు అధికారులు విచారణ జరిపారు. రాజలింగమూర్తిపై పలు క్రిమినల్ కేసులు ఉన్నందున గన్ లైసెన్స్ ఇవ్వలేమని వెల్లడించినట్లు సమాచారం.

ఐదుగురిపై ఎఫ్ఐఆర్.. పోలీసుల అదుపులో ఇద్దరు..

రాజలింగమూర్తి హత్య కేసులో ఐదుగురిపై కేసు నమోదు అయినట్లు తెలుస్తోంది. ఏ–1గా రేణుకుంట్ల సంజీవ్, ఏ–2గా పింగిలి శ్రీమాంత్(శామంత్) (బబ్లూ), ఏ–3గా మోరె కుమార్, ఏ–4 గా కొత్తూరి కుమార్, ఏ–5గా రేణుకుంట్ల కొమురయ్యను ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. హత్యకేసులో పాల్గొన్న వారిపై తమకు అందిన ఫిర్యాదు ప్రకారం పోలీసులు క్రైంనంబర్ 117/2025 ద్వారా బీఎన్ఎస్ చట్టంలోని 191(20; 191(3), 61(2),103(2), రెడ్ విత్ 190 సెక్షన్ల కింద ప్రాథమికంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ రాజలింగమూర్తి కోర్టును ఆశ్రయించినప్పటికీ స్థానిక భూ వివాదం కారణంగానే హత్యకు గురయ్యాడన్న చర్చ జరుగుతోంది. భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట గల సర్వే నంబర్ 319లో మొత్తం 2.25 ఎకరాల భూమి ఉంది. అందులో 1.25 ఎకరాల భూమికి సంబంధించి రాజలింగమూర్తికి మరో కొంతమందికి వివాదం నెలకొన్న విషయం తెలిసింది.

నిందితులెవరైనా వదలం.. భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు

హత్యకు దారి తీసిన పరిస్థితులపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు చెప్పారు. నిందితులకు రాజలింగమూర్తితో భూ తగాదాలున్నట్లు పేర్కొంటూ, ఇతర కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ మీడియాకు చెప్పారు. హత్య వెనుక ఎవరున్నప్పటికీ వదిలిపెట్టబోమని, అన్ని కోణాల్లో దర్యాప్తు సాగుతోందని స్పష్టం చేశారు. కాగా, రాజలింగమూర్తి హత్య కేసులో తాము ఇంకా ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని తెలిపారు.

బీఆర్ఎస్ నేతలపై ఆరోపణ.. రంగలోకి ఎస్పీ

తన భర్త రాజలింగమూర్తి హత్య వెనుక బీఆర్ఎస్ నాయకుల కుట్ర ఉందని ఆరోపిస్తూ మృతుడి భార్య సరళ, బంధువులు బుధవారం రాత్రి 2 గంటల వరకు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. సహకరించిన బీఆర్ఎస్ నేతల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఉదయం మృతదేహానికి పోస్ట్‌మార్టం చేసిన అనంతరం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే తమకు హామీ ఇస్తేనే మృతదేహాన్ని స్వాధీనం చేసుకుంటామని సరళ పట్టుబట్టింది. దీంతో ఎస్పీ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు రాగా మృతుడి కుటుంబ సభ్యులు వెళ్లి మాట్లాడారు. అనంతరం మృతదేహాన్ని తీసుకుని దహన సంస్కారాలు నిర్వహించారు.

రాజకీయ పార్టీలకు అంశంగా రాజలింగమూర్తి హత్య..

భూపాలపల్లి ఘటనలో రాజలింగమూర్తి హత్య రాజకీయ పార్టీలకు ఆరోపణలు, ప్రత్యారోపణలకు వేదికగా మారింది. ఈ హత్యపై పూర్తి వివరాలు కోసం హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయం ఇంటెలిజెన్స్, స్పెషల్‌బ్రాంచ్‌ల ద్వారా ఆరా తీసింది. ఇదే సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ ఘటనపై చేసిన వ్యాఖ్యలు భూపాలపల్లి ప్రాంతంలో చర్చనీయాంశం కాగా.. మరోవైపు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ హత్యపై స్పందించి తగిన విచారణను కోరామన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి స్పందిస్తూ రాజలింగమూర్తి హత్యతో తనకు గానీ, బీఆర్ఎస్ పార్టీకి గాని ఎలాంటి సంబంధమూ లేదని ఖండించారు.